క్లుప్తంగా

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



మహారాణిపేట : సీఎం వైఎస్ జగన్‌ను వైఎస్సార్‌సీపీ విశాఖ జోన్(విశాఖ, విజయనగరం, అనకాపల్లి) మహిళా విభాగం అధ్యక్షురాలు గరికిన గౌరీ శుక్రవారం అమరావతిలో కలిసి తనకు పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల గౌరీని విశాఖ జోన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించిన సంగతి తెలిసిందే.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలో శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కుంకుమ పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్ని సీతారాములకు కుంకుమాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆర్.రామ్మోహన్‌శర్మ మహిళలతో పూజలు చేయించారు. పసుపు, కుంకుమ అందజేశారు.

రేపటి నుంచి యోగా శిబిరం

ఏయూ క్యాంపస్: రుషి గాయత్రి యోగా కేంద్రం ఆధ్వర్యంలో లాసన్స్‌బే కాలనీలో ఆదివారం నుంచి 14 రోజుల ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు కేంద్రం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం 6 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. పరిమిత సంఖ్యలో ప్రవేశం కల్పిస్తామని, ఆసక్తి కలిగిన వారు 94403 95439, 77801 54103 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిబ్బపాలెంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గంగవరం పోర్టు సలహాదారు, మాజీ డీజీపీ నండూరి సాంబశివరావు ప్రారంభించిన ఈ శిబిరంలో మొత్తం 150 మంది రోగులను పరీక్షించారు. వారికి అవసరమైన మందులు, కళ్లద్దాలు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గురించి చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు అధికారులు వసంత్‌కుమార్, అచ్యుతరావు, సీఎస్సార్ మేనేజర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

చట్టాలపై పోలీసులకు అవగాహన అవసరం

విశాఖ, లీగల్ : పోలీసులు పౌర,నేర శిక్ష స్మృతి పరిధిలోని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో న్యాయసేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసులు–చట్టాలు అన్న అంశంపై జరిగిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. నేరంతో ప్రమేయం లేని అమాయకులను అరెస్టు చేస్తే తీవ్రమైన శిక్షకు గురికావలసి వస్తుందని హెచ్చరించారు. నిత్యం చట్టాలపై మూల్యాంకనం అవసరమన్నారు. వివిధ చట్టాలను వివరించారు. న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ మాట్లాడుతు పోలీసులు లోక్‌అదాలత్ సేవలను తెనుసుకోవాలన్నారు. మోటారు వాహన చట్టాలు, పరిహారం చెల్లింపు, బాలనేరస్తుల చట్టాలు అన్న అంశాలపై న్యాయసేవా ప్రాధికార సంస్థ జాతీయ శిక్షకులు రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, నగరంలోని అన్ని పోలీసు స్టేషన్లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆగని ఆకతాయిల ఆగడాలు.!

- 17వ వార్డు ఇందిరానగర్‌లో తరచూ బైక్‌ల దహనం
- స్థానికుల భయాందోళన
- నిఘా పెంచామంటున్న పోలీసులు





ఆకతాయిలకు అడ్డాగా మారిన ఇందిరా నగర్ కాలనీ ప్రధాన మార్గం (ఇన్‌సెట్) అపార్టుమెంట్ సెల్లార్‌లో గురువారం అర్ధరాత్రి దహనం చేసిన వాహనాలు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఇందిరానగర్‌లో ఆకతాయిలు చెలరేగిపోతున్నారు. ద్విచక్ర వాహనాలు ధ్వంసం చేయడమే లక్ష్యంగా హల్‌చల్ చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో జరిగిన వరుస ఘటనలే ఇందుకు నిదర్శనం. రోజురోజుకూ అసాంఘిక శక్తులకు అడ్డాగా ఈ కాలనీ మారుతుండడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. గత నెల 20న గుర్తుతెలియని వ్యక్తులు ఇక్కడి ఓ ఇంటి ఆవరణలో పార్క్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. బాధితుల ఫిర్యాదుతో ఎంవీపీ పోలీసులు రంగంలోకి దిగారు. స్థానికంగా అనేక మంది యువకులను స్టేషన్‌కు పిలిపించి విచారించినా ఫలితం లేకపోయింది. ఈ ప్రాంతంపై నిఘా పెంచినట్టు అప్పట్లో ఎంవీపీ పోలీసులు వెల్లడించారు. రాత్రి పూట గస్తీ కూడా పెంచామన్నారు. అయితే ఈ నెల 23న అర్ధరాత్రి మరో ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు మరోసారి భయాందోళనకు గురయ్యారు. రాత్రి స్థానికంగా ఉన్న ఓ అపార్టుమెంట్ సెల్లార్‌లోని రెండు వాహనాలపై పెట్రోల్ పోసి దుండగులు నిప్పంటించారు. నెల రోజుల వ్యవధిలో ఒకే తరహా ఘటనలు చోటు చేసుకోవడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఆయా పరిసరాలను పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. కొందరు యువకులు ఇక్కడ రాత్రిపూట గంజాయిని సేవిస్తూ నేరాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు ఈ కాలనీని ఆనుకొని బార్ అండ్ రెస్టారెంట్ ఉండటం కూడా నేరాలకు ఒక కారణమని స్థానికులు వెల్లడిస్తున్నారు. గత ఏడాది బార్ ఎదుట స్థానికంగా తిరిగే ఓ యువకుడు మరో యువకుడిని హత్య చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇక్కడ ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అనుమానితులను గుర్తించాం..

వాహనాలు దహనానికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాం. ఇప్పటికే అనుమానితులను గుర్తించాం. గత నెలలో జరిగిన ఘటనకు ప్రస్తుతం జరిగిన ఘటనకు సంబంధం ఉన్నట్లు గుర్తించాం. రెండు ఘటనలకు పాల్పడింది ఒక్కరే అని నిర్ధారణ అయింది. మరో రెండు రోజుల్లో నిందితులను అదుపులోకి తీసుకుంటాం. అయితే ఎందుకు వాహనాలను దహనం చేస్తున్నారనే విషయం తేలాల్సి ఉంది. ఈ ప్రాంతంలో రాత్రి గస్తీని ముమ్మరం చేయడంతో పాటు అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నాం.

– మల్లేశ్వరరావు, సీఐ, ఎంవీపీ పోలీస్ స్టేషన్

తడి, పొడి చెత్త వేరు చేయాలి



13వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, తదితరులు

అరిలోవ: ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని జీవీఎంసీ జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి తెలిపారు. 13వ వార్డు పాండురంగాపురంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం సిబ్బంది, శానిటరీ సిబ్బందితో కలసి ఆమె ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. నీటి ట్యాంకులు శుభ్రపరిచి, కుండీలు, బక్కెట్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల సత్యనారాయణ, శానిటరీ, మలేరియా ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ఇంటర్ పరీక్షలకు 10 మంది గైర్హాజరు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం జువాలజీ, మ్యాథ్స్–2బీ పరీక్షలకు 10 మంది గైర్హాజరయ్యారు. కృష్ణా జూనియర్ కళాశాలలోని సెంటర్–ఏలో జరిగిన పరీక్షకు 543 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ఐదుగురు గైర్హాజరయ్యారు. కృష్ణా డిగ్రీ కళాశాలలో సెంటర్–బీలో జరిగిన పరీక్షకు 545 మంది హాజరు కావాల్సి ఉండగా.. ఐదుగురు గైర్హాజరయ్యారు.

అనధికారిక భవనాలకు త్వరలో నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు ఇందిరానగర్‌లో అనధికారికంగా జరుగుతున్న నిర్మాణాలను జోన్–2 ఏసీపీ రఘునాథరావు శుక్రవారం పరిశీలించారు. ఇందిరానగర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై 'యథేచ్ఛగా అదనపు అంతస్తులు' శీర్షికతో ఈ నెల 23న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆయా భవనాలకు త్వరలో నోటీసులు జారీ చేస్తామన్నారు. ప్రస్తుతం జీ–20 సదస్సు పనుల్లో బిజీగా ఉండడంతో వాటిపై పూర్తి స్థాయిలో వెంటనే చర్యలు తీసుకోవడానికి వీలు పడడంలేదన్నారు. నోటీసులు జారీ చేసి సదస్సు అనంతరం వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పౌరాణిక నాటకాలు సంప్రదాయాలకు ప్రతీకలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల
- అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం



సామవేదం బాలసుబ్రహ్మణ్యం దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల, తదితరులు



సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: పౌరాణిక నాటకాలు మన సనాతన సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతికలుగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా పంచకర్ల రమేష్‌బాబు, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, అసోసియేషన్ అధ్యక్షుడు కురిటి సత్యంనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ నాటకాలను భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత మనపై ఉందన్నారు. అనంతరం ప్రదర్శించిన నాటకంలో వీరబాహుడుగా వైఎస్సార్‌సీపీ కల్చరల్ వింగ్ జోనల్ కన్వీనర్ వంకాలయ మారుతీప్రసాద్ తన నటనా కౌశలంతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. రంగస్థల సీనియర్ కళాకారుడు సామవేదం బాల సుబ్రహ్మణ్యం దంపతులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు శ్రీదేవివర్మ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో రుణ మేళా

ఎంవీపీ కాలనీ: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎంవీపీ కాలనీ శాఖలో శుక్రవారం రిటైల్ రుణ మేళా నిర్వహించారు. బ్యాంకు ఏజీఎం ఎంవీజే తిలక్ ఈ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వడ్డీ రేట్లకే ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా యూనియన్ బ్యాంకు రుణాలు మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన ఖాతాదారులు దగ్గరలోని యూనియన్ బ్యాంకు శాఖలను సంప్రదించి సత్వరమే గృహ, వాహన, విద్యా, వ్యక్తిగత రుణాలను పొందవచ్చన్నారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ బి.ఉదయభాస్కర్ మాట్లాడుతూ శుక్రవారం జరిగిన మేళాలో 40 మంది ఖాతాదారులకు రూ.34.5 కోట్లు రుణాలు మంజూరు చేసి, రుణపత్రాలను అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు కె.రమేష్, ఎ.సాహు, పి.హరిబాబు, జె.ప్రసూన్, వి.రేణుకాదేవి, పి.సుధ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు లారీలకు జీపీఎస్ వ్యవస్థ తప్పనిసరి

అల్లిపురం: ట్రాన్స్‌పోర్టు లారీలన్నింటిలో తప్పనిసరిగా జీపీఎస్ వ్యవస్థ అమర్చాలని, లోడింగ్ పాయింట్ నుంచి గమ్యస్థానం చేరేంత వరకు సంబంధిత లారీ ట్రాన్స్‌పోర్టు వారు సదరు లారీల ట్రాకింగ్ డేటా భద్రపరచాలని జోన్–2, డీసీపీ కె.ఆనందరెడ్డి కోరారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన లారీ ట్రాన్స్‌పోర్టు సంఘాల యాజమాన్యాలతోను, స్టీవ్ డోరింగ్ కంపెనీల ప్రతినిధులతో పోర్టుట్రస్ట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టుట్రస్ట్ కేటాయించిన యార్డుల్లో సంబంధిత సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, కంపెనీ యాజమాన్యాలు సూపర్‌వైజర్లను, సెక్యూరిటీ గార్డులను నియమించుకునే క్రమంలో ఆయా సంస్థలు గత చరిత్ర, నేరచరిత్రను తప్పక పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్టీవ్ డోర్స్ కంపెనీ వారు జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే లోడింగ్‌కు అనుమతించాలని కోరారు. పోర్టులో షిప్ నుంచి లోడ్ అన్‌లోడ్ చేసిన మెటీరియల్ యార్డ్‌కు పంపించే సమయంలో ప్రతి లారీకి రశీదు అందించి అన్‌లోడ్ అయిందా లేదా అని తనిఖీ చేసుకోవాలన్నారు. వేయింగ్ బ్రిడ్జి వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలని యజమానులకు తెలిపారు. ఈ సమావేశంలో హార్బర్ ఏసీపీ, హార్బర్ సీఐ, పోర్టుట్రస్ట్ ట్రాఫిక్ మేనేజర్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథం

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ర్యాలీని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ వరకు ర్యాలీ జరిగింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ రెండు వారాలు మించి జ్వరం, దగ్గు, నోటి నుంచి రక్తం పడడం వంటి లక్షణాల వల్ల క్షయవ్యాధి సోకినట్టుగా గుర్తించవచ్చని అన్నారు. జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ క్షయ వ్యాధి వల్ల ప్రాణాలు కోల్పోయే శాతం తక్కువ అన్నారు. భయ పడవలసిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతీ, ఊపిరితిత్తుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ వైద్యులు ఎస్.జీవన్‌రాణి, ఎస్.రమారెడ్డి, సమత, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరరావు, డ్రగ్స్ ఏడీ చంద్రశేఖర్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకతాటిపైకి విశ్వబ్రాహ్మణులు



విశ్వ బ్రాహ్మణులతో సమావేశమైన హనుమంతురావు

బీచ్ రోడ్డు: రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తున్నానని విశ్వబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం నగరంలోని ఒక హోటల్‌లో జిల్లా సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు విశ్వబ్రాహ్మణుల సమస్యలపై మాట్లాడుకునే స్థాయికి నేడు వెళ్లామన్నారు. భవిష్యత్తులో విశ్వబ్రాహ్మణుల నుంచి ఒకరికి ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్లా సత్యనారాయణ, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలేనికి చెందిన అవనపు కార్తీక్(18) అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ప్రేమ విఫలం కావడంతో ఈ యువకుడు అపార్టుమెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని యువకుడితో మాట్లాడి కిందికి దింపారు. అనంతరం పోలీసు స్టేషనకు తరలించి కార్తీక్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు.

విద్యా సమాచారమ్

'మానవాభివృద్ధికి ఉపయుక్తంగా వ్యవస్థలు'



సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: మానవాభివృద్ధికి ఉపయుక్తంగా సమాజ వ్యవస్థలు పని చేయాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. శుక్రవారం ఏయూ సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇంక్లూజివ్ పాలసీ స్టడీస్(సీఎస్ఎస్ఈఐపీ)లో నిర్వహిస్తున్న 'సోషల్ ఇంక్లూజివ్, ఈక్విటీ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ డిసెడ్వాంటేజ్డ్ కమ్యూనిటీస్ ఇన్ ఇండియా' రెండు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ప్రతి వ్యక్తి ప్రగతికి, అభ్యున్నతికి దోహదపడే పథకాలు ఉన్నాయన్నారు. బరంపురం వర్సిటీ అడ్జంక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.కె.పరీచా మాట్లాడుతూ గాంధీజీ, అంబేడ్కర్‌ల ఆలోచన విధానాలు అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దోహదకారిగా నిలిచిన విధానం వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా అసమానతలు దర్శనమిస్తున్న విధానాన్ని వివరించారు. సామాజిక వేర్పాటుకు పేదరికం, కులం, అణచివేత కారణాలుగా నిలుస్తున్నాయన్నారు. కేంద్రం సంచాలకుడు ఆచార్య పి.సుబ్బారావు మాట్లాడుతూ విద్య, వైద్యం వంటివి అందరికీ సమానంగా అందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో డాక్టర్ ఎన్.బాబా వల్లి, డాక్టర్ బి.శివరామకృష్ణ, 75 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో శాంతియుత జీవనం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉమార్ ఆలీషా

ఏయూ క్యాంపస్: కోపం వల్ల కలిగే నష్టాలను అన్ని మత గ్రంథాలలో ప్రస్తావించారని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అధిపతి ఉమర్ అలీషా తెలిపారు. శుక్రవారం గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో 'కోప రహిత సమాజం'అనే అంశంపై ఆయన మాట్లాడారు. శాంతియుత జీవితాన్ని గడపడానికి ఆధ్యాత్మికత ఒక సాధనంగా ఉపకరిస్తుందని చెప్పారు. డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ రచించిన 'అక్రోధ్యపా–కోపం లేని జీవితం'పుస్తకాన్ని ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున వర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్, ప్రొఫెసర్ పి.ఎస్.దీక్షిత్, డాక్టర్ రామకృష్ణ, గాంధేయవాది రావిప్రోలు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ వర్క్‌షాప్‌లో ఏయూ విద్యార్థులు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఏయూ చిత్రకళా విభాగ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ)లో నిర్వహించిన 'ఇండైజీనియస్ ఆర్ట్స్ అండ్ కాంటెంపరరీ ప్రాక్టీస్'అంశంపై నిర్వహించిన వర్క్‌షాపులో ఏయూ చిత్రకళ విభాగానికి చెందిన 39 మంది విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు. కలంకారీ బ్లాక్ ప్రింట్, కొండపల్లి బొమ్మలు వివిధ కళాకృతులు, ప్రకృతి సిద్ధమైన రంగులతో కలంకారీ బ్లాక్ ప్రింటింగ్ విధానాలను తెలుసుకున్నారు. విద్యార్థులను ఏఎన్‌యూ ప్రిన్సిపాల్ ఇ.శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ చిత్రకళా విభాగాధిపతి ఆచార్య డి.సింహాచలం శుక్రవారం అభినందించారు.

27న 'పద్మశ్రీ' ఖాదర్ వలీకి పౌర సన్మానం



మాట్లాడుతున్న రైతు సంఘం చైర్మన్ రాజు

సీతంపేట: చిరుధాన్యాల శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీకి ఈ నెల 27న పౌర సన్మానం నిర్వహించనున్నట్టు గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం చైర్మన్ పి.ఎల్.ఎన్.రాజు తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో 27వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు సన్మాన కార్యక్రమం జరుగుతుందన్నారు. చిరుధాన్యాల ఆహార ప్రేమికులంతా హాజరు కావాలని కోరారు. ముందుగా ఖాదర్ వలీ ప్రసంగం, అనంతరం మిల్లెట్ ఆహారంపై సందేహాలకు సమాధానాలు, చివరగా అభినందన కార్యక్రమం ఉంటుందన్నారు. సంస్థ కార్యదర్శి జి.ఎ స్.ఎన్.రాజు మాట్లాడుతూ మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన ఖాదర్ వలీ దేశ విదేశాల్లో ఉన్నతమైన ఖ్యాతి ఆర్జించారన్నారు. విశాఖ నగరంలో అభిమానుల కోరిక మేరకు ఆయనను స్వాగతించి సన్మానించడానికి నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ ఎం.యుగంధర్‌రెడ్డి, సత్వ నేచురల్స్ అధినేత మధుసూదన్‌రెడ్డి, ప్రకృతి పంటల రైతు సీహెచ్ రిషి, సంఘ నగర అధ్యక్షుడు దాట్ల వర్మ, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి జె.వి.రత్నం పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ ఉపాధి కార్యాలయం(క్లరికల్) ప్రాంగణంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక జరగనుందన్నారు.

ఇవీ వివరాలు..

- హెటిరోల్యాబ్స్ లిమిటెడ్‌లో 200 జూనియర్ కెమిస్ట్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి 20–26 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు రూ.22,800 జీతం ఇస్తారు.
- పొలగాని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు కంపెనీలో 30 ప్రాసెస్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీ/పీజీ/ఏదైనా డిప్లొమా అర్హత కలిగి 20–25 ఏళ్ల లోపు వయసు ఉండాలి. నెలకు రూ.12వేలు జీతం ఉంటుంది.
- స్టీల్ సిటీ సెక్యూరిటీ లిమిటెడ్(సీతంపేట–విశాఖపట్నం)లో 20 టెలీకాలర్స్, 20 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, 20 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ, 25 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు జీతం రూ.12,000.
- క్లోవ్ టెక్నాలజీస్‌లో 15 ఆటో క్యాడ్ పోస్టులకు బీటెక్(సీఎస్ఈ), 22–27 ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు అర్హులు. జీతం 13,500. ఇదే సంస్థలో డిప్లొమా లేదా ఏదైనా బీటెక్ చేసిన వారికి డెవలపర్స్ ఉద్యోగానికి అవకాశం ఉంది. నెలకు రూ.13,500 జీతం ఉంటుంది.
- పేజెస్ సంస్థలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, డాటా సోర్సింగ్, కమ్యూనికేషన్ పోస్టులను భర్తీ చేస్తారు. సైన్స్ డిగ్రీ/బీ ఫార్మసీ/ఎం ఫార్మసీ/బీఎస్సీ/ఎంఎస్సీ/బీటెక్ కంప్యూటర్స్ కోర్సులు చేసి 30 ఏళ్ల వయసు లోపు ఉన్న వారు అర్హులు. విశాఖలో రూ.16,000, హైదరాబాద్‌లో రూ.18,000 జీతం ఇస్తారు.
- ట్రస్ట్ సర్వీసెస్‌లో ఫిట్టర్, వెల్డర్, ఫ్యాబ్రికేట్, గ్రైండర్స్ హెల్పర్స్ 10 పోస్టులకు ఐటీఐ చదివి 18–48 ఏళ్ల వయసు గల వారు అర్హులు. నెలకు రూ.15,000 నుంచి రూ.25,000 వరకు జీతం ఉంటుంది.
- సువర్ణభూమి సంస్థలో మార్కెటింగ్ మేనేజరు పోస్టుకు బీటెక్/ఎంబీఏ అర్హత కలిగి 18–36 ఏళ్ల వయసు గల వారిని తీసుకుంటారు. పది పోస్టులు ఉన్నాయి. నెలకు రూ.17,000 జీతం. ఇదే సంస్థలో 10 టెలికాలర్ ఉద్యోగాలకు 18–36 ఏళ్ల వయసు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జీతం రూ.9,000. అభ్యర్థులు నేరుగా కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయానికి శనివారం ఉదయం 10 గంటలకు హాజరు కావచ్చు. ఆసక్తి గల వారు ncs.gov.inలో పేర్లు నమోదు చేసుకోవాలి.

తెలుగు ప్రేక్షకుల ఆదరణ గొప్పది

- నటి మన్నారా చోప్రా



మాట్లాడుతున్న సినీ నటి మన్నారా చోప్రా

బీచ్‌రోడ్డు: తెలుగు ప్రేక్షకుల ఆదరణ చాలా గొప్పది అని జక్కన్న, తిక్క తదితర చిత్రాల్లో నటించిన హీరోయిన్ మన్నారా చోప్రా అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శుక్రవారం వృమ్ ట్రావెల్ యాప్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజలు కొత్త కథలను, కొత్త ఆవిష్కరణలు ఆదరిస్తారన్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా ప్రయాణికులు, డ్రైవర్లకు మేలు చేకూరేలా వృమ్ యాప్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రముఖ వైద్యుడు కూటికుప్పల సూర్యారావు మాట్లాడుతూ విశాఖ నగరంలో డ్రైవర్లు క్రమశిక్షణతో విధులు నిర్వహించడం వల్ల నగరానికి మంచి పేరు వస్తోందన్నారు. నటుడు శాంతి చంద్ర, యాప్ సీఈవో సృజన పైడి తదితరులు పాల్గొన్నారు.